రుద్రభూమి... వసతుల లేమి!

- వ్యర్థాలతో దుర్వాసన
- ముళ్లపొదలు.. పిచ్చిమొక్కలతో భయంకరం
- డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తున్న అగనంపూడి శ్మశానవాటిక


శ్మశానవాటిక ఆవరణలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు

అగనంపూడి: బంధువులు, ఆత్మీయులు, ఐన వారి కడసారిచూపు కోసం దహన సంస్కారాలకు హాజరైన వారికి అగనంపూడి శ్మశానవాటికలో అపరిశుభ్రమైన వాతావరణం స్వాగతం పలుకుతోంది. పిచ్చమొక్కలు.. చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ 79వ వార్డులోని అగనంపూడి కైలాసభూమిలో వసతులు మృగ్యంగా మారాయి. రెండేళ్ల కిందట నిర్మించిన షెడ్లు నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా ఉన్నాయి. శ్మశాన వాటికలోకి అడుగు పెట్టాలంటే హడలి పోయే పరిస్థితి ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెత్తాచెదారాల మయం

ఆవరణ అంతా వ్యర్థాలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. మందు బాబులకు అడ్డాగా మారింది. కైలాసభూమిలో పాత షెడ్ల రేకులు విరిగిపోయి శిథిలమయ్యాయి. కొత్తగా నిర్మించిన రెండు షెడ్లు కూడా నిర్వహణలేక అధ్వానంగా మారాయి. ఆవరణలోని బోర్‌వెల్ కండలు కరిగిపోయేలా కొట్టినా కడవ నిండడానికి పావుగంట సమయం పడుతోంది. కడవడు నీటి కోసం పాట్లు పడాల్సి రావడం బాధాకరమని మృతుల బంధువులు, ఆత్మీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటారు వేయాలని కోరుతున్నారు. మృతుల బంధువులు నిరీక్షించడానికి ఎలాంటి వసతులు లేవు.


కైలాసనాథుని మండపం చుట్టూ పెరిగిన ముళ్లపొదలు



అగనంపూడి కైలాసభూమి

కానరాని వసతులు


నీరురాని చేతిపంపు

అగనంపూడి సెక్టార్-2,3ల్లోని 8 నిర్వాసితకాలనీలు, చుట్టూ ఏర్పాటైన కాలనీల నుంచి ప్రతీరోజూ రెండు, మూడు దహన సంస్కారాలు చేస్తున్నారు. దుర్భరమైన వాతావరణంలో అక్కడ నిరీక్షించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. కడసారి చూపు కోసం వెళ్లిన వారిని కళ్లారా చూసి వచ్చే పరిస్థితి కల్పించాలని కోరుతున్నారు. ఆవరణలో చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగించి సీసీ పాత్‌వేలు ఏర్పాటు చేయాలని, మోటార్ వేయాలని, లేదా జీవీఎంసీ పైప్‌లైన్ ద్వారా కుళాయిని అమర్చాలని స్థానికులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో అభివృద్ధి



గత ప్రభుత్వంలో శ్మశానవాటిక ఎత్తు పెంచారు. షెడ్లు నిర్మించారు. ఆవరణను చదును చేశారు. ఆ తర్వాత శ్మశాన వాటికను పట్టించుకొనే నాథుడు లేకపోవడంతో ఈ దుస్థితి కలిగింది. ఆవరణలోకి అడుగు పెట్టాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సి రావడం బాధాకరం. పాలకులు స్పందించి తక్షణమే ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారం, ముళ్ల పొదలు తొలగించే ఏర్పాటు చేయాలి.

– కొలిపాక అప్పారావు, పెదమడక నిర్వాసితకాలనీ

కనీసం నీటి వసతి కల్పించండి



చేతులు నొప్పిపెట్టేలా కొడితే తప్పా బోరు నుంచి నీరు రావడంలేదు. జీవీఎంసీ నీటిసరఫరా విభాగం ఆధ్వర్యంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి ట్యాప్ వేస్తే మంచిది. మోటార్ వేస్తే స్నానాలు చేయడానికి అవకాశం ఉంటుంది. ఆవరణను శుభ్రం చేయాలి. షెడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి.

– గుదే సుశీలా గజేంద్రరావు, ప్రజా సంఘం నాయకుడు

విద్యార్థుల్లో ఆసక్తి పెంచడానికే..



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: విద్యార్థులకు చదవడంపై ఆసక్తిని పెంచడానికే చదవడం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ తెలిపారు. ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి కథలు, చరిత్ర పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులు ఉత్తమంగా ఎదగడంతో పాటు చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు.

ఈవోఐలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు

నిర్ణయించిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈవోఐలకు వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించారు. స్టీల్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ నెల 3న జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఈవోఐలకు వ్యతిరేకంగా జగదాంబ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీలో స్టీల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నాయకులు కోరారు. అలాగే 9న ఈవోఐలు తెరిచే రోజు స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులంతా ఒక గంట టూల్‌డౌన్ పాటించాలని నిర్ణయించారు. 12న అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. 16న స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె బ్యాలెట్ నిర్వహించాలని నిర్ణయించారు. కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు సీహెచ్. నర్సింగరావు, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, డొక్కా నర్సింగరావు, రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, యు. రామస్వామి, వై.టి. దాస్, జి.ఆర్.కె. నాయుడు, సీహెచ్. సన్యాసిరావు, డి. శ్రీనివాస్, శ్రీనివాసరాజు, రాజా, ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సరస్వతీపూజ


సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: సంకట మోచన గణపతి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారిని విద్యా గణపతిగా ఆదివారం అలంకరించారు. విద్యార్థులచే సరస్వతీ పూజలు చేయించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు నరసింగరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డీజీఎం విజయభాస్కర్, మంత్రి శ్యాంప్రసాద్, సుధాకర్, అప్పలరాజు, తాతారావు, శ్రీరాములు పాల్గొన్నారు.

250 మందికి కంటి వైద్య పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కూర్మన్నపాలెం: కణితి రామాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. సత్యసాయిబాబా సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో విశాఖ ఐ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ లావణ్య, సాయికృష్ణ 250 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. మరి కొందరికి కళ్లజోళ్లు అందిస్తామని ప్రకటించారు. పలువురిని శస్త్ర చికిత్సలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్దలు ప్రగడ శ్రీను, బొడ్డ గోవింద్, దానప్పలు, సత్తిబాబు, అప్పలనాయుడు, సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

పోర్టు కాలుష్యం నివారించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక: గంగవరం పోర్టు కారణంగా ఉత్పన్నమవుతున్న కాలుష్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో వివిధ కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. పోర్టు వై జంక్షన్ వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ పోర్టు కాలుష్యం వల్ల సుమారు ఎనిమిది గ్రామాలు, కాలనీల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. పోర్టు, స్టీల్‌ప్లాంట్‌ల నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు పెరిగిపోతున్నాయన్నారు. దీనిపై కూడా ప్రజా ప్రతినిధులు, పోలీసులు దృష్టి సారించి పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, బి.రమణ, లక్ష్మి, కిరీటం, స్థానిక కాలనీల నివాసులు అశోక్, భార్గవ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికురాలి మృతి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి జారిపడి కార్మికురాలు మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా, గుర్ల మండలం, గొలగాం గ్రామానికి చెందిన చెందక సత్యాలు (48), తన భర్త సింహాచలంతో కలిసి మూడేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చారు. వారు ఆరిలోవలోని తోటగరువు వద్ద నివాసం ఉంటూ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు. రుషికొండలోని తారకరామ లేఅవుట్‌లో గల ఆదిత్య అపార్ట్‌మెంట్ వెనుక నిర్మాణంలో ఉన్న ఒక భవనం వద్ద వారు కూలి పనులు చేస్తున్నారు. ఆదివారం మూడో అంతస్తులో శ్లాబ్ నిర్మాణ పనులు జరుగుతుండగా, పనిలో భాగంగా పైనున్న సత్యాలు కళ్లు తిరిగి మొదటి అంతస్తు శ్లాబ్‌పై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు

అగనంపూడి: ఉపాధ్యాయులు దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే మార్గనిర్దేశకులని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. 85వ వార్డు పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కొరుపోలు కొండబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పాత్ర సమాజంలో కీలకమైందని, ఆ వృత్తిలో రాణించేవారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కొండబాబు యూనియన్ నాయకుడిగా చేసిన సేవలను ప్రస్తుతించారు. మండల విద్యాశాఖాధికారి గొంతిన సాయి శైలజ మాట్లాడుతూ గ్రామస్తులు, ఉపాధ్యాయులతో సమన్వయంతో వ్యవహరించి పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కార్యక్రమంలో పెదగంట్యాడ ఎంఈవో రమణాజీ, పాఠశాల హెచ్‌ఎం పి.బ్రహ్మానందం, నాయకులు ఇల్లపు ప్రసాద్, గవర సోమశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, పాఠశాల కమిటీ చైర్మన్ వై.శ్రీను పాల్గొన్నారు.


కొండబాబు మాస్టార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, ఎంఈవో సాయి శైలజ

బహుముఖ ప్రజ్ఞావంతుడు ఆరుద్ర

సీతంపేట: అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని గొప్ప సాహితీమూర్తి ఆరుద్ర అని వక్తలు కొనియాడారు. ఆరుద్ర శత జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆరుద్ర సాహిత్య దర్శనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ ఆరుద్ర గొప్ప పండితుడు, బహుముఖ ప్రజ్ఞావంతుడని, పద్యాలు, వ్యాసాలు, నాటికలు, సినిమా పాటలు, డిటెక్టివ్ నవలలు ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియలు చక్కగా నిర్వహించారన్నారు. ఆరుద్ర ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించే వారని, ఆయనను కలిసిన ప్రతి సారి ఒక కొత్త విషయాన్ని చెప్పేవారన్నారు. ఇటువంటి సాహిత్య కార్యక్రమాల వల్ల ఆరుద్ర వంటి మహోన్నత వ్యక్తికి న్యాయం చేసినట్టు అవుతుందన్నారు. ఆరుద్ర సినిమా పాటలు రాయడానికి ముందు మద్రాసులో మిలటరీ బ్యాండ్‌లో చేరారని, దానివల్ల మ్యూజిక్, ట్యూన్‌పై మంచి అవగాహన పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆరుద్ర సినీ సాహిత్యంపై రాంభట్ల నృసింహశర్మ రచించిన సమగ్రాంధ్ర సాహితీ సముద్ర ఆరుద్ర శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆరుద్ర పాడిన పలు సినీ పాటలను రాంభట్ల ఆలపించి సభికులను అలరించారు. ఆరుద్ర ప్రముఖ రచనల్లో త్వమేహం పై ప్రయాగ సుబ్రహ్మణ్యం, సమగ్రాంధ్రా సాహిత్యంపై డి.రాంబాబు ప్రసంగించారు.


ఆరుద్ర శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఆచార్య బేతవోలు

ఘనంగా అన్నసమారాధనలు

కూర్మన్నపాలెం: వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో భారీగా అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 86వ వార్డు గ్రీన్‌లాండ్ ఫేజ్-6లో కాలనీకి చెందిన మహిళలే అన్నీ అయి అన్నసంతర్పణ చేశారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రాసాలమ్మ కాలనీ, తిరుమలనగర్, కణితి, లక్ష్మీపురం కాలనీల్లో పూజా కమిటీలు, కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో అన్నసమారాధనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు దామోదర్, దానప్పలు, బొడ్డ గోవింద్ .టి.వి.నాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: అన్నదానం చేసి పేదల కడుపు నింపడం అభినందనీయమని 76వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని డెయిరీ కాలనీలో ఎల్ఐజీ-2 కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్న సమారాధనను మంత్రి శంకరనారాయణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కమిటీ సభ్యులు ఎంకేఎస్ మూర్తి, వెంకటేష్, రమేష్, శేఖర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 74వ వార్డు వెంపల్లినగర్‌లో గ్రామ అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. సుమారు మూడువేల మంది అన్న ప్రసాదాలు స్వీకరించారు.


గ్రీన్‌లాండ్ కాలనీలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న మహిళలు


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మంత్రి శంకర నారాయణ తదితరులు

ఆటో డ్రైవర్ల జీవనోపాధికి గండి

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలు, వ్యాన్‌లు, జీపు డ్రైవర్ల ఉపాధికి గండి పడిందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఫ్రీ బస్ పథకంలో ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని డిమాండ్ చేస్తూ అక్కయ్యపాలెం హైవే కూడలిలో ఆదివారం డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంధనం, నిత్యావసర సరకులు, వాహన విడి భాగాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీనికి తోడు పెంచిన జరిమానాలు ఆటో డ్రైవర్లకు కునుకు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. ఉబర్, ర్యాపిడోతో ఇప్పటికే 40 శాతం ఆటో డ్రైవర్లకు ఉపాధి పోయిందని, చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మరో 30 శాతం నష్టపోయామన్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి నష్టం కలిగించే ఉబర్, ర్యాపిడో అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల హామీని తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రవికృష్ణ, కేలం శివ, కె.నూకరాజు, జి.నందీశ్వరరావు, శంకర్, సిహెచ్.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, నర్సింగ్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు, యూనియన్ నాయకులు

రక్షణలేని అంగన్‌వాడీ కేంద్రం

- కాలువ పక్కన సామాజిక భవనంలో నిర్వహణ
- భయాందోళనలో తల్లిదండ్రులు, బాలింతలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని సిద్దేశ్వరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ భవనం ముందు పెద్ద కాలువ ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ కేంద్రంలో 15 మంది చిన్నారులు ఉన్నారు. 15 మంది గర్భిణులు, 16 మంది బాలింతలు ఈ కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల తల్లులు 90 మందికి ప్రతి రోజూ పౌష్టికాహారం అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ముందు పెద్ద కాలువ ఉండడంతో ఏం ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు కాలువ పక్కనే ఆటలాడుకోవడంతో తల్లులు భయపడుతున్నారు.

అన్నీ అక్కడే

ఒక గది మాత్రమే ఉండడంతో అక్కడే వంట చేయడం, వంట సామగ్రితో పాటు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని ఆ గదిలోనే భద్రపర్చాల్సి వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం కేటాయించాలని, లేనిపక్షంలో నిధులు మంజూరు చేసి చుట్టూ ప్రహరీ, వంటగది ఏర్పాటు చేయాలని వారంతా కోరుతున్నారు.

ఏటా కార్తీకమాసంలో అద్దె భవనంలోకి..

అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న సామాజిక భవనం ఏటా కార్తీక మాసంలో మాలధారులతో నిండిపోతోంది. భవాని మాలలు వేసుకునే సిద్దేశ్వరం గ్రామస్తులకు అంగన్‌వాడీ కేంద్రమే పీఠం. దీంతో ఆ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చాల్సి వస్తోంది.ఎన్నికల సమయంలో కూడా ఈ భవనాన్ని ఖాళీ చేయాల్సి వస్తోంది. ఇక్కడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్రాన్ని ఇక్కడి నుంచి తరలించాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ఒకే గదిలో సామగ్రి, వంట


కాలువ పక్కన ప్రమాదకరంగా చిన్నారులు

అన్నీ అక్కడే



ఒకే గది ఉండడంతో పాటు పిల్లల ఆలనాపాలనతో పాటు అందులోనే సామాన్లు భద్రపరుస్తున్నారు. అక్కడే వంటలు చేస్తున్నారు. గుడ్లు పగిలిపోయినవి ఉంటే దుర్వాసన వెదజల్లుతోంది. వంటలకు, సామాన్లు భద్రపరుచుకోవడానికి ఏర్పాట్లు చేయాలి. భవనం చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలి.

– కె. అనూష చిన్నారి తల్లి

భయం.. భయం



నా కుమార్తె యోగ్యశ్రీ. ఏడాది నుంచి కుమార్తెను తీసుకొని ఈ కేంద్రానికి వస్తున్నా. ఇక్కడి దించి వెళ్తున్నా మళ్లీ తీసుకువచ్చే వరకు భయం భయంగా ఉండాల్సి వస్తోంది. కేంద్రం పరిసరాలు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు స్పందించి సురక్షితమైన భవనంలోకి ఈ కేంద్రాన్ని తరలించాలి.

– వై.రాణి, చిన్నారి తల్లి

ప్రమాదాలు జరిగితే..



ఒకే గదిలో వంటలు చేస్తుండడంతో పాటు అక్కడ ఉన్న గ్యాస్ సిలిండర్‌తో పిల్లలు ఆడుకుంటే ఏవైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలాగే కేంద్రం ముందు కాలువ ప్రమాదకరంగా ఉంది. పెద్ద పెద్ద రాళ్లు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.

–సంతోషి సాహు, చిన్నారి తల్లి

ఘనంగా తెలుగు సాంస్కృతిక ఉత్సవాలు

మద్దిలపాలెం: త్వరలో జరగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా.. ఆంధ్ర సారస్వత పరిషత్ , కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో తెలుగు సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. ఉత్సవాల్లో భాగంగా కర్నాటక సంగీతం, అష్టావధానం, కవి సమ్మేళనం వంటివి నిర్వహించారు. అష్టావధానంలో పాల్గొన్న పండితులను, కవి సమ్మేళనంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కవులను డాక్టర్ గజల్ శ్రీనివాస్ సత్కరించారు. విశాఖ బీట్స్ గాయకులు సిరివెన్నెల పాటలను ఆలపించారు. అలాగే కట్టా జేజినారాయణ హరికథ గానం చేసి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. వరకట్న వేధింపులపై విజయనగరం మహిళా కళాకారులు ప్రదర్శించిన 'తనదాకా వస్తే' నాటిక అందరినీ ఆలోచింపజేసింది.